క్లుప్తంగా

పునర్వసు కల్యాణం

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో పునర్వసు నక్షత్ర సందర్భంగా శనివారం మాస కల్యాణం జరిపించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ విగ్రహాలను మండపంలోకి తీసుకుని వచ్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, యూత్రాధారణ, యజ్ఞోపవీత ధారణ, స్వామి వారి అమ్మవారి ప్రవర్లు, మధుపర్కాలు, మహా సంకల్పం మంగళాష్టకాలు, జిలకర బెల్లం మాంగల్య పూజ మాంగల్య ధారణ మంగళ హారతి, మంత్రపుష్పం చేపట్టారు. ఈ కల్యాణాన్ని పర్ణశాలకు చెందిన ఇద్దరు దంపతులు పీటలపై కూర్చుని చేయించారు. అనంతరం అన్నదాన చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు శేషం కిరణ్ కుమార్ ఆచార్యులు,అమరవాది కిశోర్‌కుమార్‌చార్యులు, ఆలయ సూపరింటెంట్ కిషోర్, ఇంచార్జ్ ప్రసాద్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చౌకదుకాణం ఏర్పాటు చేయాలి

దుమ్ముగూడెం: మండలంలోని డి.కొత్తగూడెం, ధర్మవరం గ్రామాల్లోని గిరిజనులు 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న మహాదేవపురం గ్రామానికిపోయి చౌక దుకాణంలో నిత్యావసర వస్తువులు తెచ్చుకుంటున్నారని, ఈ ఇబ్బందిని తొలగించేందుకు స్థానికంగా చౌక దుకాణాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీపీఎం ఆధ్వర్యంలో డి.కొత్తగూడెం, ధర్మవరం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సంతకాల సేకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఈ రెండు గ్రామాల్లో సుమారు 200 పైగా తెల్ల రేషన్ కార్డులు కలిగిన గిరిజనులు ఉన్నారని, వీరు రాను పోను 30 కిలోమీటర్ల దూరం పోయి రేషన్ తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మర్మం చంద్రయ్య, కారం బజారు, నిమ్మల మధు, తెల్లం రామ్మూర్తి, తెల్లం సతీష్ కారం వెంకటేశ్వర్లు, కారం అన్వేష్, తెల్లం భద్రమ్మ, తెల్లం నాగరత్నమ్మ, పూనెం సుశీలభీ, చిలకమ్మ పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

అశ్వాపురం: మండల పరిధిలోని గొల్లగూడెం, అమెర్ద, జగ్గారం గ్రామ పంచాయతీల్లో సుమారు 70 లక్షలతో నిర్మించనున్న 14 సీసీ రోడ్లకు శనివారం జెడ్పీటీసీ సులక్షణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రేగా నాయకత్వంలో కొనసాగుతున్న ఈ అభివృద్ధిని చూసి ఎన్నికల్లో ఆయనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, వైస్ ఎంపీపీ వీరభద్రం, సర్పంచ్‌లు తాటి సుజాత, సున్నం రాంబాబు, ఉపసర్పంచ్‌లు ఆవుల వెంకన్న, బొల్లినేని గణేష్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఫ్రెషర్స్‌డే వేడుకలు

చర్ల: చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బండి సత్యనారాయణ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రెగ్యులర్‌గా కళాశాలకు వచ్చి మంచిమార్కులతో ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడి మృతి

మణుగూరురూరల్: మండల పరిధిలోని చిక్కుడుగుంట గ్రామంలో సీపీఐ సీనియర్ నాయకుడు తంతరపల్లి శేఖర్ శనివారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య, నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డిలు శేఖర్ గృహానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించారు. పూలమాలు వేసి ఎర్రజెండా కప్పి ఘన నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో సీపీఐ నాయకులు జంగం మోహన్ రావు, డి.సుధాకర్, ఎస్‌కె.సర్వర్, అక్కి నరసింహారావు, ఎంపీటీసీ కామిశెట్టి రామారావు, కుటుంబరావు, సత్యనారాయణ, భీమరాజు తదితరులు ఉన్నారు.

ఓటమి భయంతోనే వాయిదా యత్నం

మణుగూరుటౌన్: సింగరేణి ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే టీబీజీకేఎస్, రాష్ట్ర ప్రభుత్వం మెనేజ్‌మెంట్ సహకారంతో ఎన్నికలు వాయిదా పడేందుకు కుటిలయత్నాలు చేస్తున్నాయని ఏఐటీయూసీ మణుగూరు బ్రాంచ్ సెక్రటరీ రాంగోపాల్ అన్నారు. శనివారం మణుగూరు ఓసీలో జరిగిన ఫిట్ మీటింగ్‌కు హాజరై ఆయన మాట్లాడారు. ఏఐటీయూసీ కార్మికుల పక్షాన ఎన్నికల నిర్వహణకు కోర్టును ఆశ్రయించిందని, సింగరేణి యాజమాన్యం వాయిదాలు కోరుతూ వస్తోందని అన్నారు. పలు దఫాలుగా డీసీఎల్ వద్ద జరిగిన సమావేశాల్లో ఎన్నికలు నిర్వహించాలని కోరిన సంఘాలు.. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికలు సాకుగా చూపడం ఎవరి ప్రయోజనం కోసమని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు మల్లెల రామనర్సయ్య, పుల్లారావు, ఆవుల నాగరాజు, సాయిప్రకాశ్ చారి, రవికుమార్, చిత్తారి నరేందర్, బ్రహ్మం, రాజేశ్వరరావు, సుధాకర్ తదితరులు ఉన్నారు.

రోడ్డుపైనే దిగుమతులు..

సరుకు తీసుకొస్తున్న లారీలతో ఇక్కట్లు

- రహదారిపైనే నిలుపుతుండడంతో రాకపోకలకు అంతరాయం
- పోలీసులు దృష్టి సారించాలని కోరుతున్న ప్రజలు



రోడ్డుకు రెండువైపులా నిలిపిన సరుకుల లారీలు



సరుకుల లారీ కారణంగా నిలిచిపోయిన వాహనాలు

మణుగూరుటౌన్: దినదినాభివృద్ధి చెందుతున్న మణుగూరు పట్టణంలో ఇతర ప్రాంతాల నుంచి ట్రాన్స్‌పోర్టుల ద్వారా వచ్చే వస్తువులు ఇబ్బడిముబ్బడిగా రోడ్డుపైనే దిగుమతి చేపడుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వరంగల్– కొత్తగూడెం ప్రధాన రహదారితో పాటు సింగరేణి నుంచి పాల్వంచ, ఇతర రాష్ట్రాలకు బొగ్గు తరలింపులతో పాటు, బీటీపీఎస్‌కు వచ్చే భారీ పరికరాల వాహనాల రద్దీ ఉంటుంది. మండల కేంద్రమైన మణుగూరుకు వివిధ గ్రామాల వివిధ పనుల నిమిత్తం ప్రజల రాకపోకలు, వ్యాపారుల కొనుగోళ్లకు ఆటోల హడావుడి ఆటోల అడ్డాలతో నిత్యం రద్దీ సర్వ సాధారణం. ఇదే సమయాన ఇక్కడ దుకాణాల ముందరే ట్రాన్స్‌పోర్టు వాహనాలు నిత్యం భారీ ఎత్తున సరుకుల దిగుమతులతో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

కొన్నాళ్లు ఆపినా మళ్లీ మొదలు..

కొద్ది రోజుల క్రితం ప్రధాన రహదారిపై ఓ ట్రాన్స్‌పోర్టు లారీ నుంచి సరుకులు దించుతున్న క్రమంలో పక్కగా వెళ్తున్న కారును మరో లారీ ఢీకొంది. దీంతో కొన్నాళ్లు ట్రాన్స్‌పోర్టు లారీలను ఊరి చివర నిలిపి దిగుమతులు చేశారు. కానీ కొన్నాళ్లకు మళ్లీ విజయవాడ, గుంటూరు, హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల నుంచి ట్రాన్స్‌పోర్టుల ద్వారా వస్తున్న సిమెంట్ తదితర సామగ్రిని యథేచ్ఛగా దిగుమతి చేస్తున్నారు. ఒకే సారి రోడ్డుకిరువైపులా అన్‌లోడ్ చేసుకుంటున్న సంఘటనలు నిత్యకృత్యంగా మారాయి. దీంతో రోడ్డుపై కార్లు కూడా పక్క పక్కనే వెళ్లే పరిస్థితి లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రోడ్డుపై ఆరు టైర్ల వాహనం వస్తే మరో మోటార్ సైకిల్ కూడా వెళ్లలేని పరిస్థితి ఉంటోంది. నడిరోడ్డుపై దర్జాగా సరుకు దిగుమతులు చేస్తున్నారని మున్సిపాలిటీ అధికారులు, పోలీసులు దృష్టి సారించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ఇతర ప్రాంతాల నుంచి సరకులతో వచ్చే లారీలను ఊరిచివరి నిలిపి దిగుమతి చేసేలా దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు.

పోలీసులు దృష్టి సారించాలి



లైసెన్సు లేదని, మద్యం తాగి వాహనాలు నడుపుతున్నారని తనిఖీ చేసే పోలీసులు ట్రాఫిక్ సమస్యపై మాత్రం దృష్టి సారించడం లేదు. సామాన్యులపై ఉక్కుపాదం మోపే పోలీసులు రోడ్డుపైనే అడ్డగోలుగా దిగుమతులను ఆపకపోవడం బాధాకరం. కొత్తగూడెం, పాల్వంచల్లో ఊరి చివర దిగుమతికే అనుమతి ఉంది.

– మేదరమెట్ల శ్రీనివాస్, స్థానికుడు

వాహనాలను కట్టడి చేస్తాం



నడిరోడ్డుపై దిగుమతులు చేసి వాహన చోదకులకు, ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తే సహించం. ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా ఇలాంటి దిగుమతి చేసే ట్రాన్స్‌పోర్టుల యాజమానులతో మాట్లాడతాం. ప్రత్యామ్నాయాలు చూసుకోవాలని సూచిస్తాం.

– రమాకాంత్, సీఐ, మణుగూరు

అల్పాహార పథకం పిల్లలకు వరం



విద్యార్థులతో కలిసి టిఫిన్ చేస్తున్న జిల్లా మానిటరింగ్ అధికారి నాగరాజు శేఖర్

భద్రాచలం: ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం పిల్లలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహార పథకం పిల్లలకు వరమని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఏ.నాగరాజ శేఖర్ అన్నారు. శనివారం ఆయన తాతగుడి సెంటర్ వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందజేసి వారితోపాటు భుజించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం 8.45 గంటల వరకు మెనూ ప్రకారం పథకాన్ని ఖచ్చితంగా అమలుజేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేన్నారు. ఎంఈఓ సమ్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అటవీభూములు ఆక్రమిస్తున్నారు..

చర్ల: ఎన్నో దశాబ్దాలుగా పోడుకొట్టి సాగు చేసుకుంటున్న తమ భూములను కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆక్రమించుకున్నారని, వారిపై చర్యలు తీసుకుని భూములను తిరిగివ్వాలని ఆదివాసీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో చర్ల మండలం అంబేడ్కర్ సెంటర్ నుంచి ర్యాలీగా రేంజర్ కార్యాలయం వరకు చేరుకున్నారు. అక్కడ ధర్నా నిర్వహించి చర్ల రేంజర్ ఉపేందర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్డీ చర్ల, దుమ్ముగూడెం సబ్ డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ మాట్లాడుతూ.. 1980 నుంచి ఆదివాసీలు పోడుభూమి సాగు చేసుకుంటుండగా.. ఫారెస్ట్ భూములని చెప్పి కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు వారి పేరుమీద పట్టాలు చేయించుకున్నారని, దీనిపై వెంటనే ఎంక్వయిరీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు చిరిగిడి నరేష్, ఇర్ప కనకమ్మ, బొగ్ర సమ్మక్క, సప్కా నాగలక్ష్మి, అలవాల భద్రమ్మ, రమేష్, శేఖర్, రాజు, ఇర్ప సమ్మక్క,తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీ షీటర్‌లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న టౌన్ సీఐ నాగరాజు రెడ్డి

భద్రాచలంఅర్బన్: స్థానిక టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం సీఐ నాగరాజు రెడ్డి రౌడీ షీటర్‌లకు కౌన్సెలింగ్ చేపట్టారు. ఒక్కొక్కరికి కౌన్సెలింగ్ నిర్వహిస్తూ.. ఇటీవల కాలంలో ఏ నేరాలకు పాల్పడ్డారు? కుటుంబ పరిస్థితులు? జీవన విధానం? తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. హత్య కేసుల్లో నిందితులుగా ఉండి తరచూ దాడులు, బెదిరింపులు, భూకబ్జాల ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి తీవ్ర స్థాయిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగినా, బెదిరింపులకు పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. టౌన్ ఎస్సై మధు ప్రసాద్, పీవీఎస్ రావులు పాల్గొన్నారు.

తహసీల్‌లో కార్మికుల వినతి

దమ్మపేట: ప్రభుత్వ సంక్షేమ పథకాల మంజూరులో తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ, గృహ నిర్మాణ రంగంలో పనిచేసే పెయింటింగ్ కార్మికులు తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. మొదట మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించిన పెయింటింగ్ కార్మికులు.. ఆపై సీనియర్ అసిస్టెంట్ మధుకు వినతిపత్రం అందజేశారు. కార్మికులు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల్లో తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాము, శివకృష్ణ, వినోద్, కోటి, మాధవరావు, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

చర్ల: సీపీఐ పేదల పక్ష పార్టీ అని, పేదలు, కష్ట జీవుల సమస్యలు ఉన్నంత వరకు సీపీఐ వాటి పరిష్కారానికి పోరాటాలు చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు కల్లూరి వెంకటేశ్వరావు అన్నారు. శనివారం మండలంలోని కలివేరు గ్రామంలో సీపీఐ గ్రామశాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. నాయకులు నానిపెల్లి భద్రం, అడ్డగర్ల తాతాజీ, కొంగూరి రాము, నాగేశ్వరరావు, సీతమ్మ, రమాదేవి, సన్యాసి, ముత్తయ్య, పద్మ పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

చర్ల: మండలంలోని కలివేరు గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నెస్లే–జేసీఐ గ్రూప్ సహాయంతో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చర్ల మండల ప్రాంతంలోని ఆదివాసీ గ్రామాలకు చెందిన 300 కుటుంబాల వారికి నిత్యావసరాలను అందజేశారు. భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ శనివారం వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐ రాజగోపాల్, ఎస్సైలు వెంకటప్పయ్య, నర్సిరెడ్డి, టీవీఆర్ సూరి, నెస్లే గ్రూప్‌కు చెందిన వసీమ్ అహ్మద్, జేసీఐ నుంచి విశ్వేశ్వర్‌రావు, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: మండలంలోని వలస గొత్తికోయలకు నెస్టల్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. శనివారం తాళ్లగొమ్మూరు ఐటీసీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో గొత్తికోయల కుటుంబాలకు ఎస్సై రాజ్‌కుమార్ చేతుల మీదుగా నిత్యావసర కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై ఏసుబు, కానిస్టేబుల్ రామకృష్ణ పాల్గొన్నారు.



చర్ల: ఆదివాసీలకు నిత్యావసరాలు అందజేస్తున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్

నిలిచిన ఆన్‌లైన్ సేవలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గ్రామపంచాయతీ కార్యాలయంలో గత సెప్టెంబర్ 26వ తేదీ నుంచి ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. ఆన్‌లైన్ చేసే సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు కోరుతున్నారు.

దోమల మందు పిచికారీ

మణుగూరురూరల్: మండల పరిధిలోని బుడుగుల, ఖమ్మం తోగు, బుగ్గ గ్రామాల్లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం రెండో విడత దోమల మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ.. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మలేరియా, డెంగీ వంటి జ్వరాలు రాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం వైద్యశిబిరాలు నిర్వహించి గ్రామ ప్రజలకు వైద్యపరీక్షలు చేసి నివారణమందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, ఎస్‌యుఓ లింగ్యానాయక్, వైద్యసిబ్బంది పుష్పారాణి, ఉమేష్, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక 'చేయూత'

బూర్గంపాడు: మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన దాసరి ప్రసాద్ గత కొన్నిరోజులుగా జ్వరంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండగా.. విషయం తెలిసిన మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ ప్రతినిధులు స్పందించారు. శనివారం బాధిత కుటుంబానికి రూ.7 వేల ఆర్థికసాయమందించారు. ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, ట్రస్ట్ సభ్యులు మల్లారెడ్డి, రామచంద్రారెడ్డి, రాజేష్, చిన్ననాగిరెడ్డి, చంటి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన 'వడ్డెర' నాయకులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శాసనసభ్యుడు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పొదెం వీరయ్యను జిల్లా వడ్డెర సంఘం నాయకులు క్యాంపు కార్యాలయంలో కలిశారు. పుష్పగుచ్ఛం అందించి.. రానున్న ఎన్నికల్లో తమ సంఘం నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. మరోమారు ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు వడ్డెర సంఘం నాయకులందరమూ శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని పొదెంకు చెప్పారు.

అధికారమే పరిష్కారం

దుమ్ముగూడెం: బహుజనులకు అధికారమే అన్ని సమస్యలకు పరిష్కారం అని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఇర్ప రవికుమార్ అన్నారు. శనివారం బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని రామారావుపేట, రాయగట్టు, కే.వీరభద్రపురం గ్రామాల్లో 'ఇంటింటికీ బీఎస్పీ–గడపగడపకూ ఆర్ఎస్పీ' కరపత్రాలు పంచారు. ప్రజల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు కంచర్ల సింహాద్రి, జిల్లా ఇన్‌చార్జ్ తడకల శివకుమార్, నాయకులు గాడిద దామోదర్ రావు,కేసు పాక కృష్ణ, పూనెం నరేష్, మార్కాపురం సీతారాములు, సోడి వీరస్వామి, సొంది వెంకట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బూర్గంపాడు: మండలంలోని బూర్గంపాడు, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం, సారపాక గ్రామపంచాయతీల్లో శనివారం పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ రేగా కాంతారావు శంకుస్థాపన చేశారు. బూర్గంపాడులో నిర్మించిన ఐదు సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. గౌతమిపురంలో పాండవుల బజార్‌లో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించనున్న పెద్దడొంక అభివృద్ధి పనులకు, సారపాక పంచాయతీలో నిర్మించనున్న 37 సిమెంట్ కాంక్రీట్ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు వందల కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్న బీఆర్ఎస్‌కే ఉందని అన్నారు. దీంతోపాటు, బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని విప్ కాంతారావు ప్రారంభించారు. అనంతరం మండల మహిళా సమాఖ్యకు ప్రభుత్వం అందించిన వరికోత యంత్రాన్ని కూడా ఆరంభించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, రైతుబంధు సమితి మండల కన్వీనర్ బిజ్జం శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు సిరిపురపు స్వప్న, భూక్యా శ్రావణి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, కామిరెడ్డి రామకొండారెడ్డి బీఆర్ఎస్ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విగ్రహ ఆవిష్కరణ



మణుగూరురూరల్: కుమురం భీమ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న విప్ రేగా కాంతారావు

మణుగూరురూరల్: పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కుమురం భీమ్ విగ్రహాన్ని విప్ రేగా శనివారం ఆవిష్కరించారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్ నుంచి సాయిబాబా ఆలయం వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ డివైడింగ్, సెంట్రల్ లైటింగ్‌ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కాగా, ఆసియా క్రీడల్లో భారతదేశ క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభను కనబరచడంపై విప్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివాసీ సంఘాల నాయకులు వట్టం రాంబాబు, అనిల్ కుమార్, రాజేశ్వరరావు, తోలెం శ్రీను, అంజయ్య, శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత కరెంట్ మొక్కుబడేనా..?

భద్రాచలంఅర్బన్: రజకులు, నాయి బ్రాహ్మణులకు 240 యూనిట్ల ఉచిత కరెంటు హామీ మొక్కుబడేనా..? అని భద్రాచల శాసనసభ్యుడు పొదెం వీరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉచిత కరెంట్ హామీ ఇచ్చిన నాటి నుంచి మూడు నెలల పాటు ప్రభుత్వమే బిల్లులు చెల్లించినట్లు, ఆ తరువాత నుంచి గత 8 నెలలుగా బిల్లులు ఆపేసినట్లు తన దృష్టికి వచ్చిందని అన్నారు. ప్రస్తుతం విద్యుత్ శాఖ అధికారులు బిల్లులు చెల్లించాల్సిందిగా ఒత్తిడి చేస్తున్నారని రజకులు, నాయీ బ్రాహ్మణులు ఎమ్మెల్యేను ఆశ్రయించడంతో.. శనివారం ఆయన విద్యుత్ శాఖ కార్యాలయానికి వెళ్లారు. డీఈని కలిసి ఈ పరిస్థితిపై ఆరా తీశారు. 8 నెలలుగా బిల్లులు ఆపేసినట్లు నిర్ధారణ అయిందని, తూతూ మంత్ర హామీలు ఇచ్చే బీఆర్ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగ్గిన విధంగా ప్రజలు బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే వీరయ్య అన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సరెళ్ల నరేష్, టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతిరేల రవికుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బోగాల శ్రీనివాస రెడ్డి, బలుసు నాగ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



డీఈ జీవన్ కుమార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరయ్య

రుణమాఫీ లావాదేవీల పరిశీలన

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు గ్రామంలో ఉన్న కో–ఆపరేటివ్ బ్యాంకును డీసీసీబీ ఏజీయం కృష్ణమోహన్ శనివారం సందర్శించి రుణమాఫీ లావాదేవీలను పరిశీలించారు. ఇటీవల ప్రభుత్వం రుణమాఫీ పథకం కింద 958 మంది రైతులకు సుమారు రూ.4కోట్ల 20లక్షల 45వేల 121ను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ లావాదేవీలకు సంబంధించి బ్యాంక్ మేనేజర్ నర్సింహారావును, సొసైటీ చైర్మన్ కిలిమి ఎల్లారెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎంతమందికి నూతన రుణాలు అందజేశారనే విషయాలను తెలుసుకున్నారు. ఈ సమయంలో దుమ్ముగూడెం గ్రామానికి చెందిన మజ్జి సూర్యారావు అనే రైతు రుణమాఫీ కింద నాకు రూ.70వేలు చెల్లించాల్సి ఉండగా రూ.69వేలు ఇచ్చారని మిగిలిన రూ.1000 చెల్లించలేదని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. రైతులకు చెందిన కొంత నగదును బ్యాంకు అధికారులు వివిధ రకాల ఖర్చులు, బీమా సదుపాయం బ్యాంకు ఖాతా షేర్ క్యాపిటల్ పేరుతో తగ్గించి ఇస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో దీనికి సంబంధించిన బ్యాంకు స్టేట్‌మెంట్లను ఏజీఎం పరిశీలించారు.

బతుకమ్మ చీరల పంపిణీ

అశ్వాపురం: అశ్వాపురం ఎంపీపీ సుజాత, సర్పంచ్ సున్నం రాంబాబు ఆధ్వర్యంలో మండల పరిధిలోని జగ్గారం గ్రామ పంచాయతీలో మహిళలకు శనివారం బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. మొండికుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళలకు మొండికుంట సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ సుధీర్, ఎంపీటీసీ కమటం నరేష్ బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఇదే గ్రామంలో యువతకు సర్పంచ్ మల్లారెడ్డి క్రీడా సామగ్రిని అందించగా.. పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: కూనవరం గ్రామపంచాయతీలోని రేషన్ దుకాణంలో పంచాయతీ సర్పంచ్ ఏనిక ప్రసాద్ శనివారం బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, వార్డ్ సభ్యులు, జీపీ కార్యదర్శి సంధ్యారాణి, మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ విజేతలకు సన్మానం

గుండాల: పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణులై ఉద్యోగం సాధించిన పూనెం సునీల్, గుండెబోయిన రాకేష్లను బీఆర్ఎస్ పార్టీ గుండాల మండల అధ్యక్షుడు తెల్లం భాస్కర్, యూత్ అధ్యక్షుడు సయ్యద్ అజ్జులు శనివారం పార్టీ కార్యకర్తలతో కలిసి అభినందించారు. సన్మానం చేశారు. మారుమూల ప్రాంతాలను నుంచి పోటీ పరీక్షల్లో నెగ్గిన వీరిని స్ఫూర్తిగా తీసుకుని యువత కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిట్ట రాములు, నాగరాజు, ప్రమోద్, ప్రశాంత్, సతీష్, తిరుపతి, రాకేష్, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ప్రిన్సిపాల్‌కు..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా నియమితులైన జాన్ మిల్టన్‌ను భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం బాధ్యులు శనివారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా స్వాగతం పలికారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వేముల కామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తోటమల్ల బాలయోగి, సహాయ కార్యదర్శులు భీమవరపు వెంకటరెడ్డి తదితరులు నూతన ప్రిన్సిపాల్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా పని చేసిన డి.భద్రయ్య కూడా సన్మానించారు. కార్యక్రమంలో భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీనియర్ అధ్యాపకుడు వీరన్న, పూర్వ విద్యార్థుల సంఘం బాధ్యులు గూటాల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపా కేసు ఎత్తివేయాలి

చర్ల: సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా భద్రాచలం డివిజన్ కార్యదర్శి కొండ చరణ్‌పై పోలీసులు పెట్టిన ఉపా కేసు ఎత్తివేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి డిమాండ్ చేశారు.

ఈ మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఆర్.రమేశ్‌కు వినతిపత్రం అందించారు. రంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై జరిగే ఉద్యమాల్లో చురుకుగా ఉండే చరణ్‌పై పోలీసులు అక్రమంగా కేసులు పెట్టారన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయన్న, మండల కమిటీ సభ్యులు సుక్కన్న, లక్ష్మి, కౌశిక్, శ్రీకళ పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన వైద్యశిబిరం

చర్లరూరల్: మండల పరిధిలోని ఉంజుపల్లి గ్రామంలో శనివారం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. అవసరమైనవారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సందీప్, ఎల్‌టీ రవి, మారుతి నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, ఆదివారం పూసుగుప్ప గ్రామంలో వైద్య శిబిరం జరగనున్నట్లు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

ములకలపల్లి: మండలపరిధిలోని చలమన్ననగర్, చింతలపాడు గ్రామాల్లో లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ, కిన్నెరసాని ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ కొటారి చలపతిరావు శిబిరాన్ని ప్రారంభించగా.. పలువురికి వైద్య చికిత్సలు అందించారు. ఈ గ్రామాల్లో ఐటీడీఏ చొరవతో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు పాఠశాలల్లో.. 80 మంది విద్యార్థులకు లయన్స్ క్లబ్ బాధ్యులు పలకలు, నోటు పుస్తకాలు, పెన్నులు పెన్సిళ్లలను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఎంసీటీసీ నూపా సరోజిని, క్లబ్ మండల అధ్యక్షుడు రాయల కేథారేశ్వరరావు, సెక్రటరీ రేపాక ప్రసాదరావు, చిట్లూరి రంజిత్‌కుమార్, అనంతుల మహేశ్, నూపా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



చర్లరూరల్: వైద్య శిబిరం నిర్వహిస్తున్న సొసైటీ సభ్యులు